రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 మంగళవారం
సహర్ 5:06 బుధవారం



- కొన్ని సంఘాలకే పదవీ కాలం పెంపు
- మరికొన్ని సంఘాలకు ప్రత్యేక అధికారులు
- ఎమ్మెల్యేలకు నచ్చని చోట తొలగించారనే విమర్శలు



సహకార సంఘాల్లో రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతులకు సేవలందించడానికి ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరిగి పోతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తమకు నచ్చని, తమ మాట వినని వారు ఉన్న చోట ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆయా సంఘాల చైర్మన్లు ఆరోపిస్తున్నారు.

● పలు సంఘాలకు ప్రత్యేక అధికారులు

పదవీ కాలాన్ని పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసే సమయంలోనే రాజకీయ జోక్యం కారణంగా మానకొండూర్ నియోజక వర్గంలోని పోరండ్ల, గట్టుదుద్దెనపల్లి, మెట్‌పల్లి, గద్దపాక, ఊటూరు ప్రాథమిక సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పెంచకుండా ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సహకార సంఘాలతోపాటు ఇదే నియోజక వర్గ పరిధిలో సిరిసిల్ల జిల్లాలో ఉన్న గాలిపల్లి, ఇల్లంతకుంట సహకార సంఘాల పాలక వర్గాలను కూడా కొనసాగించకుండా ప్రత్యేక అధికారులను నియమించారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి కార ణంగానే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా ప్రత్యేకాధికారులనునియమించి పాలక వర్గాలను పదవీ కాలం పెంచ కుండా పక్కనపెట్టారని బీఆర్‌ఎస్ ఆరోపిస్తున్నది. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో పాటు ఆయా సంఘాల చైర్మన్లు ఇదే ఆరోపణను చేస్తు న్నారు. ఆయా సహకార సంఘాల్లో పలు అక్రమాలు జరి గిన నేపథ్యంలోనే పాలక వర్గాల పదవీ కాలం పెంచకుండా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రత్యేక అధికా రులను నియమించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

చొప్పదండి నియోజక వర్గంలోని చొప్పదండి, ఆర్నకొండ వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలక వర్గాల పదవీ కాలాన్ని పెంచుతూ ఉత్త ర్వులు జారీ అయ్యాయి. ఏమైందో ఏమో కాని ఇరవై రోజుల తర్వాత ఆ పాలక వర్గాల పొడగింపును రద్దు చేస్తు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగానే పదవీ కాలం పొడగించినా పాలక వర్గాలను రద్దు చేశారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతులు ఎరువుల కొరత తదితర సమస్యలు ఎదుర్కొంటున్న తరుణంలో వ్యవసాయ సహకార సంఘాలలో చోటు చేసుకుంటున్న రాజకీయాలు ఆయా ప్రాంతాల రైతులకు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టేవిగా మారాయని విమర్శిస్తు న్నారు. బీఆర్‌ఎస్‌లో చురుకైన నేతలుగా ఉంటూ ఆ పార్టీకి గ్రామంలో పట్టు సాధించిన నేతలు సహకార సంఘాల చైర్మన్లుగా ఉన్న చోటనే పాలక వర్గాలను పొడగించడం లేదని అంటున్నారు. మరికొన్ని సహకార సంఘాల పాలక వర్గాలు కూడా రద్దయ్యే ప్రమాదం ఉన్నదని ప్రచారం జరుగుతున్నది.

● జిల్లాలో 30 సహకార సంఘాలు

జిల్లాలో 30 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా వీటి పదవీ కాలం ఫిబ్రవరి 14తో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలల పాటు ఆయా సంఘాల పాలక వర్గాలనే కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వ్యవసాయ సహకార సంఘాలకు వర్తించేలా ఈ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కరీంనగర్, దుర్శేడ్, గట్టుదుద్దెనపల్లి, మాన కొండూర్, దేవంపల్లి, ఊటూరు, పోరండ్ల, నుస్తులాపూర్, చొప్పదండి, ఆర్నకొండ, గంగాధర, కురిక్యాల, రామడుగు, కొక్కెరకుంట, చిగురుమామిడి, హుజూరాబాద్, తుమ్మనపల్లి, జూపాక, ఇల్లందకుంట, మల్యాల, బోగంపాడు, జమ్మికుంట, తనుగుల, ధర్మారం, వీణవంక, తాడికల్, గద్దపాక, మెట్‌పల్లి, సైదాపూర్, వెన్నంపల్లి ప్రాథమిక సహకార సంఘాలు రైతులకు అవసరమైన సేవలు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ సంఘాల పదవీ కాలం ఫిబ్రవరి 14 నుంచి మరో ఆరు నెలలు పొడగించాల్సి ఉన్నది. అధికార పార్టీ ఎమ్మెల్యేల జోక్యం కారణంగా కొన్ని సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడగింపునకు నోచుకోవడం లేదు.

రాజకీయాలకతీతంగా

రైతులకు సేవలందించాలి

- జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడగిస్తూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా స్థానిక ఎమ్మెల్యేలు రాజకీయ కక్షతో ప్రభుత్వ ఆదేశాలను అమలు కాకుండా చూస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. ఈ సంఘాలు రాజకీయాలకతీతంగా రైతులకు మేలు చేయాల్సి ఉండగా సహకార సంఘాల చైర్మన్లు తమకు నచ్చని వారు, ఇతర పార్టీలకు చెందిన వారు ఉన్నందున ఎమ్మెల్యేలు వారి పదవీ కాలాన్ని పొడగించకుండా ఒత్తిడి తెచ్చి ప్రత్యేకాధికారులను నియస్తున్నారని ఆయన అన్నారు. అవినీతి అక్రమాలు జరిగిన సహకార సంఘాల్లోనే పాలక వర్గాలను పొడగించడం లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్న మాటలను ఆయన తోసిపు చ్చారు. ఆయా సంఘాల్లోవచ్చిన ఫిర్యాదులపై విచారిం చిన కోర్టులు స్టే ఇవ్వడాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు రాక ముందే అవినీతి జరిగిందంటున్న సంఘాల చైర్మన్లను, పాలక వర్గాలను ఎందుకు తొలగించలేదని ఆయన ప్రశ్నించా రు. అధికార పార్టీ వ్యవసాయ సహకార సంఘాల విషయంలో రాజకీయాలు చేయకుండా యూ రియా కొరతతోపాటు రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్య లపై దృష్టి సారిస్తే మంచిదని ఆయన సూచించారు.

పంటలు కాపాడేందుకు

చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): పంటలు కాపాడేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి యాసంగి సాగునీటి సరఫరా పై ఆయన కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పంటలు ఎండి పోతున్నట్లు సమాచారం అందుతోందని, ప్రభుత్వానికి వ్యతిరేక వాతావరణ సృష్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, చీఫ్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్‌లు రిపోర్టు తీసుకుని విద్యుత్ శాఖ సమన్వయంతో పంట నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని, నీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వివిధ ప్రాజెక్టులు, కాల్వల కింద 18 లక్షల ఎకరాలు, బోర్ల కింద 37 లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయన్నారు. రాబోయే 15 రోజులు పంటలకు అవసరమైన నీటిని విడుదల చేసేలా పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. చివరి ఆయకట్టు వరకు నీళ్ల చేరేలా బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ సిద్దిపేట, నల్గొండ, యాదాద్రి, వనపర్తి జిల్లాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ అలం, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్,జిల్లావ్యవసాయాధికారిభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల పనితీరుపై సమీక్ష

భగత్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఇటీవల ప్రవేశ పెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల పనితీరు పై జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ సమీక్ష నిర్వహించారు. కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చించారు. కార్యక్రమంలో జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన సీపీ

కరీంనగర్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలం కలెక్టర్ పమేలా సత్పతిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు సీపీ పూల మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు అధికారులు చర్చించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేస్తు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడుతూ వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలను తప్పనిసరిగా చెల్లించాలని ఆయా శాఖల అధికా రులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యం చేరుకోకుంటే ఆర్థిక సంఘం నుంచి వచ్చే నిధుల విషయంలో ఇబ్బంది అవుతుంద న్నారు. ప్రభుత్వ నిధుల నుంచి నెలాఖరులోగా పన్నులు చెల్లించాలని ఆదేశించారు.

● ఈజీఎస్ పనులు, ఎస్డీఎఫ్ పనులు పూర్తి చేయాలి..

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఈజీఎస్ పనులు, ఎస్డీఎఫ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, ప్రహరీ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో తనిఖీ చేస్తూ పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎస్డీఎఫ్ పనులు గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. ఆర్అండ్‌బీ, పంచా యతీరాజ్, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో పూర్తయిన పనులకు సంబం ధించిన బిల్లులు చెల్లించేందుకు టోకెన్ నంబర్ జనరేట్ చేయాలన్నారు నిర్దేశించిన గడువులోగా జిల్లాలో వ్యవసాయేతర భూములను గుర్తించా లని తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడారు. గ్రౌండింగ్ పనులు, సూపర్‌చెక్, గ్రామాల్లో మార్కెట్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గ్రీవెన్స్, లాగిన్‌లో ఉన్నవి క్లియర్ చేయా లని సూచించారు. వివరాలను నివేదిక రూపంలో అందించాలని సూచించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి నగరంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. అందులో భాగంగా 8, 9 తరగతుల్లో స్కూల్ టాపర్స్ నుంచి ఇద్దరిని ఎంపిక చేసి వారికి మ్యాథ్స్ ఒలింపియాడ్, సైన్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యం సహకారంతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. దీనిలో భాగంగా జనవరి 7 నుంచి 9 వరకు, 18 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ తరగతుల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్ నుంచి 174 మంది మ్యాథ్స్, 174 మంది సైన్స్ ఒలింపియాడ్‌లో శిక్షణకు హాజరయ్యారన్నారు. జనవరి 29వ తేదీన సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆఫ్ సైన్స్, హమ్మింగ్ బర్డ్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారన్నారు. మార్చి 7న ఫలితాలు వెలువడ్డాయని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తెలిపారు. జోనల్‌లో, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు.

● ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

సుభాష్‌నగర్: ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పవన్‌కుమార్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులూ..
ఇస్రో పిలుస్తోంది
● యువిక-25 కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానం

6

కోరలు చాస్తున్న బెట్టింగ్ భూతం

- లక్షల రూపాయలు కోల్పోతున్న యువత
- కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక ఆత్మహత్యలు
- పిల్లల వ్యవహారాలను తల్లిదండ్రులు గమనించాలంటున్న నిపుణులు


తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన నిఖిల్‌రావు హైదరాబాద్‌లో చదువుకుంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఐదు లక్షల రూపాయల మేరకు అప్పులు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి ఆ అప్పులు కట్టి మళ్లీ బెట్టింగ్‌ల జోలికి వెళ్లవద్దని మందలించాడు. అయినా తీరు మార్చుకోని నిఖిల్‌రావు బెట్టింగ్‌లో పాల్గొని మళ్లీ అప్పుల పాలయ్యాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో మందలించారు. హైదరాబాద్‌కు వెళ్లి చదువుకోమని సూచించారు. దీంతో హైదరాబాద్‌కు వెళుతున్నానని చెప్పి బస్సు ఎక్కి మారమధ్యలో దిగి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కొద్ది నెలల క్రితం కరీంనగర్‌కు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో లక్షల రూపాయలు పోగొట్టుకుని అప్పులపాలై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించగా అన్నీతానై సోదరి తన వద్దనే ఉంచుకుని పెద్ద చేసి డిగ్రీ చదివించింది. ఆ తరువాత ఒక కొరియర్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఖాళీ సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారాడు. సోదరి సర్దిచెప్పడంతో మానుకున్నప్పటికీ కొద్ది రోజులకే మళ్ళీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగామారి మళ్లీ అప్పులు చేశాడు. ఈ విషయం సోదరికి తెలిస్తే బాగుండదని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏడాది క్రితం కరీంనగర్‌కు చెందిన ఒక ఇంజనీరింగ్ విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో తొమ్మిది లక్షలు పోగొట్టుకోగా విషయం తెలిసి తల్లిదండ్రులు ఆ డబ్బులను చెల్లించారు. ఇక బెట్టింగ్ ఆడనంటూ తల్లిదండ్రులతో చెప్పాడు. ఆ తరువాత మళ్లీ బెట్టింగ్‌కు అలవాటుపడి అప్పులపాలయ్యాడు. విషయం తల్లిదండ్రులకు చెప్పలేక తిమ్మాపూర్ మండలంలోని కెనాల్‌లో పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

కరీంనగర్‌కు చెందిన ఒక బ్యాంక్ ఉద్యోగి కూడా బెట్టింగ్‌కు వ్యసనపరుడిగా మారి ఆర్థికంగా పెద్ద మొత్తంలో నష్టపోయి చివరకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇలా.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలుగామారి లక్షల్లో డబ్బులు పోగొట్టుకుని ఇటీవలి కాలంలో కమిషనరేట్ వ్యాప్తంగా 10 మంది వరకు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇటువంటి కేసులు 10 శాతం మాత్రమే బయటకు తెలుస్తున్నాయి.



కరీంనగర్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఆర్థికంగా నష్టపోయి చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తక్కువ సమ యంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురాశతో కొందరు ఆన్ లైన్ గేమ్స్, బెట్టింగ్‌లను ఆడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మరి కొందరు సర దాగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ క్రమక్రమంగా బెట్టింగ్‌లలో డబ్బులు పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. మొదట సరదాగా ప్రారం భమైన బెట్టింగ్ క్రమక్రమంగా వారికి తెలియకుండానే ఇక వ్యసనంగా మారు తోంది. అందులో చిక్కుకుని బయటకు రాలేక, ఇతరులకు చెప్పుకోలేక లోలోపల మదనపడుతూ చివరకు బలవన్మరణాలకు పాల్పడుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఇటువంటి ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వలలో పడినవారు యువత, కళాశాల విద్యార్థులు, కొందరు ప్రైవేట్ ఉద్యోగులు ఉండడం గమనార్హం. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో యువత డబ్బులతోపాటు ప్రాణాలు పోగొట్టుకుంటున్నది.

● పుట్టగొడుగుల్లా..

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లను నిషేధించినప్పటికీ నిర్వాహకులు ఇతర మార్గాల ద్వారా అనగా ఇతర రాష్ట్రాలలో ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు అనుమతులున్న ప్రాంతాల నుంచి ఫేక్ ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్)లతో దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. స్మార్ట్‌ఫోన్‌లకు ఈ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలు పంపిస్తూ అమాయక యువకులకు వల వేసి

(మిగతా 8వ పేజీలో)

మట్టి కుండ.. సల్లగుండ..

రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి ప్రత్యేక రంజన్లు



సిరిసిల్లలో అమ్మకానికి సిద్దంగా ఉన్న రాజస్థాన్ రంజన్లు

సిరిసిల్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు ఈసారి తొందరగానే మండిపోతున్నాడు. ఏప్రిల్, మేలో భగ్గుమనే భానుడు తన ప్రతాపాన్ని చూపించేవాడు. ఇప్పుడు మార్చిలోనే తన పనిని మొదలు పెట్టేశాడు. ఎండ దాహాన్ని తీర్చుకోవడానికి మట్టి రంజన్లను ఆశ్రయిస్తున్నారు. పేదవాడి ఫ్రిజ్‌గా పేరొందిన ఆదిలాబాద్ రంజన్లకు పోటీగా ఈసారి గుజరాత్ రాజస్థాన్‌ల నుంచి ఎక్కువగా రంజన్లు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చేరుకున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌కు చెందినవారే నేరుగా సిరిసిల్లకు తీసుకవచ్చి అమ్మకాలు సాగిస్తుండడంతో స్థానికంగా సీజనల్ వ్యాపారాలు చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రంజన్లతో పాటు మట్టి కూజాలు, వంట చేసుకునే మట్టి పాత్రలు కూడా వచ్చాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన రంజన్లకు నల్లాలతో పాటు రకరకాల డిజైన్లు ఉండడం, ధర అందుబాటులోనే ఉన్నాయి. రాజస్థాన్ రంజన్లు రూ.150 నుంచి రూ.350 వరకు ఉన్నాయి. మరోవైపు గుజరాత్ నుంచి మట్టి రంజన్లతో పాటు సిరామిక్ రంజన్లు వచ్చాయి. సిరామిక్ రంజన్లు నీటి చల్లదనం ఎక్కువగా ఉంటుందని భావించి కొనుగోలు చేస్తున్నారు. ఈ రంజన్లు రూ.250 నుంచి రూ.500 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. గుజరాత్, రాజస్థాన్‌ల నుంచి ప్రత్యేక కంటైనర్ల ద్వారా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి దిగుమతి చేసుకున్నారు. ఇక్కడి నుంచి మండలాలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు.



రంజన్లు

విద్యార్థులూ.. ఇస్రో పిలుస్తోంది



- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- యువిక-25 కార్యక్రమానికి దరఖాస్తుల ఆహ్వానం
- దేశ వ్యాప్తంగా నిర్వహణ

చొప్పదండి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువిక)ను నిర్వహిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా చేపట్టబోయే ఈ కార్యక్రమం కోసం తొమ్మిదో తరగతి విద్యార్థులను ఇస్రో ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనలో ఇటీవల ఇస్రో 100ప్రయోగాలు పూర్తి చేసుకొని అగ్ర దేశాలకు దీటుగా పరిశోధనలను చేపడుతుండగా ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేం దుకు ఇస్రో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

23 వరకు గడువు

విద్యార్థులు మార్చి 23వరకు www.isro.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను వడపోసిన అనంతరం ఏప్రిల్ 7న 337 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాబితాను విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. మే 19నుంచి 30 వరకు యువిక-25 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మే31 తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారు.

విద్యార్థులకు అన్నీ ఉచితమే

ఇస్రో నిర్వహించే యువిక కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14రోజులు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, గ్రహాలు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడేఅవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

విద్యార్థుల అర్హత

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులకు 50శాతం వెయిటేజ్ ఇస్తారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో విద్యార్థులు ఉంటే ఐదుశాతం, జిల్లా, రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 10శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే ఐదు శాతం, పల్లెప్రాంతాలకు చెందిన విద్యార్థులకు 20శాతం ప్రాధాన్యత కల్పిస్తారు.





దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో యువిక నిర్వహణ

ఇస్రో యువిక-25 కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడుకేంద్రాల్లో నిర్వహిస్తోంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్, కేరళలోని తిరువనంతపురం, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కర్ణాటకలోని బెంగుళూరు, గుజరాత్‌లోని అహ్మదాబాద్, తెలంగాణలోని హైదరాబాద్, మేఘాలయ రాష్ట్రంలోని షిల్లాంగ్‌లో నిర్వహిస్తోంది.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై విద్యార్థి ఆత్మహత్య

తిమ్మాపూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లికి చెందిన సిరికొండ నిఖిల్‌రావు (22) అనేవిద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొని అప్పులపాలై ఆతహత్యకు చేసుకున్నాడు. మన్నెంపల్లి గ్రామానికిచెందిన సిరికొండ తిరుపతిరావు కుమారుడు నిఖిల్‌రావు హైదరాబాద్‌లో బీఎస్సీ అగ్రికల్చర్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. ఈనెల7న హైదరాబాద్ నుంచి మన్నెంపల్లికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు వెళతానని చెప్పడంతో అతడి తండ్రి కరీంనగర్ బస్టాండ్‌లో వదిలివెళ్లాడు. 4.45కి తండ్రికి ఫోన్‌చేసి తాను హైదరాబాద్ బస్సు ఎక్కానని చెప్పాడు. ఉదయం 11.45గంటల సమయంలో తిరుపతిరావు వద్ద పనిచేసే శంకర్ పొలానికి నీళ్లపెట్టి మోటర్‌బంద్ చేయడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి గట్టుమీద చెప్పులు, కర్చీప్ కనిపించాయి. అనుమానం వచ్చిన శంకర్ బావిలోకి తొంగిచూడగా నిఖిల్‌రావు మృతదేహం కనిపించింది. వెంటనే శంకర్ తిరుపతి రావుకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిఖిల్‌రావు మృతదేహాన్ని బయటకు తీయించారు. నిఖిల్‌రావు కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.



నిఖిల్ రావు (ఫైల్)

● ఆన్‌లైన్ బెట్టింగే కారణం..

హైదరాబాద్‌లో చదువుకుంటున్న నిఖిల్‌రావు కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. గతంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నిఖిల్‌రావు ఐదు లక్షల వరకు పోగొట్టుకున్నాడు. అతడి తండ్రి ఆ అప్పులు చెల్లించి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడవద్దని మందలించాడు. అయినా తీరు మార్చుకోని నిఖిల్‌రావు తిరిగి ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి మళ్లీ డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు కట్టాల్సిందిగా ఇంట్లో అడిగాడు. ఇక తమవల్ల కాదని, చదువుకు మాత్రం డబ్బులు ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పులతో ఇబ్బంది పడుతున్న నిఖిల్‌రావు మనస్థాపానికి గురై హైదారాబాద్ వెళ్లలేక, మధ్యలోనే బస్సు దిగి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమశేఖర చిట్ ఫండ్స్ కార్యాలయం ఫర్నీచర్ ధ్వంసం చేసి, తనను నోటికి వచ్చినట్లు దుర్భాష లాడాడని బాధితుడు గూడెం నరేందర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మేడదుల సతీష్ అనేవ్యక్తి సోమశేఖర చిట్‌ఫండ్‌లో రూ.10లక్షల చిట్టి వేశాడు. డబ్బులు మొత్తం కట్టకపోవడంతో రిమైండ్ నోటీస్ పంపించారు. నోటీస్ ఎందుకు పంపా రంటూ తీవ్ర ఆగ్రహానికి గురైన సతీష్ చిట్‌ఫండ్‌కు వెళ్లి మేనేజర్ క్యాబిన్ గ్లాస్ ధ్వంసం చేశాడు. నోటికి వచ్చినట్లు దుర్భా షలాడాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

రుద్రంగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మానాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు రుద్రంగిలోని పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న సిబ్బంది ఈఎంటి వెంకట రమణ, పైలట్ చాణక్యలు తీవ్రగాయాలైన శ్రీకాంత్‌కు ఫస్ట్ ఎయిడ్ చేసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన దర్శనాల కరుణాకర్, ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి మల్లయ్యల ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ చల్మెడ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మల్లయ్యకు కాలు విరిగింది. చికిత్స నిమిత్తం సిరిసిల్ల తర లించారు.

30 ఏళ్ల తర్వాత తల్లిని కలిసిన తనయ

- ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోయిస్టు వసంత
- పోలీసుల సమాచారంతో తల్లిని కలిసేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లిన కూతురు

కోరుట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండల సిరికొండ గ్రామానికి చెందిన మావోయిస్టు వసంత అలియాస్ శాంతక్కఅలియాస్ మమతక్కను 30సంవత్సరాల తరువాత ఆమె కూతురు భవాని కలిసింది. అనారోగ్య కారణాలతో పోలీసులకు లొంగిపోయిన ఛత్తీస్‌గఢ్ బస్తర్ డివిజన్‌కమిటీ సభ్యురాలు వసంతను ఆమె కూతురు భవాని కాంకేర్‌కు వెళ్లి సోమవారం కలిసింది. 2024 నవంబర్‌లో కాంకేర్ పోలీసులు ఆమెతోపాటు మరో ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. ప్రస్తుతం వసంత మోకాళ్లనొప్పులు, షుగర్‌వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు వసంత గురించి ఆరాతీసి తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాలుగు రోజుల క్రితం తెలంగాణ పోలీసులు భవాని ఆచూకీ తెలుసుకొని ఆమెతల్లి సమాచారాన్ని చేరవేశారు. ప్రస్తుతం వసంత కూతురు భవాని ప్రేమవివాహం చేసుకొని భూపాలపల్లి జిల్లా పరకాలలో ఉండడంతో కోరుట్ల పట్టణంలోని ఆమె బంధువులకు విషయం తెలియజేశారు. దీంతో స్పందించిన బంధువులు భవానితో కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ప్రత్యేక వాహనంలో వెళ్లారు. దీంతో అక్కడి పోలీసు ఉన్నతాధికారులు విచారణచేపట్టి వారికి సంబంధించిన పత్రాలను స్వీకరించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు వారికి తెలిపారు.



పోలీసుల అదుపులో ఉన్న వసంత (ఫైల్)



భవాని

● భర్త ఎన్‌కౌంటర్‌లో మృతి..

వసంతభర్త రాంరెడ్డి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినా అజ్ఞాతం వీడి జనజీవనంలోకి రాలేదు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన రాంరెడ్డి 1979లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. అప్పుడు పోలీసులు రాంరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలునుండి వచ్చిన అనంతరం కథలాపూర్ మండల సిరికొండ గ్రామనికి చెందిన వసంతతో వివాహం జరిగింది. అనంతరం దంపతులిద్దరూ పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరికికూతురు భవాని జన్మించింది. అనంతరం రాంరెడ్డి-వసంత దంపతులు కూతురును ముంబాయిలో ఉన్న సోదరుడు సాయిబాబకు అప్పగించారు. పసుల రాంరెడ్డి 2001లో ఉత్తర తెలంగాణ స్పెషన్ కార్యదర్శి హోదాలో ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లా ఎలారెడ్డిపేట మండలం మదిమల్ల సమీనంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న వసంత కాంకేర్ పోలీసుల అదుపులో ఉంది.

పోచమ్మవాడలో ఒకరి హత్య?

- కుళ్లిన స్థితిలో మృతదేహం
- రెండు రోజుల కిందటే ఘటన
- స్నేహితుడే నిందితుడిగా అనుమానాలు?



రాము (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన బాలసాని రాము(41) మృతదేహాన్ని సోమవారం స్థానిక పోచమ్మవాడలోని ఒకగదిలో కుళ్లిన స్థితిలో పోలీసులు గుర్తించారు. రాము హత్యకు గురైనట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బాలసాని రాము లక్ష్మీనగర్‌లో భార్య, పిల్లలతో నివాసం ఉంటూ కమాన్ సమీపంలోని పెట్రోల్‌బంక్ పక్కన క్రీపాయింట్ నిర్వహిస్తున్నాడు. రాము భార్య లతశ్రీ ఈనెల 5న సంగారెడ్డిలోని తన పుట్టింటికి కూతురుతో కలిసి వెళ్లింది. రాము, అతడి కుమారులు లక్ష్మీనగర్‌లోనే ఉన్నారు. శనివారం రాత్రి 8 గంటలకు సంతోష్ అనేవ్యక్తి రాముకు ఫోన్‌చేశాడు. వెంటనే బైక్‌పై పోచమ్మవాడలోని సంతోష్ వద్దకు వెళ్లాడు. అప్పటి నుంచి రాము తిరిగి లక్ష్మీనగర్‌లోని తన ఇంటికి చేరలేదు. ఈ విషయం మృతుడి కొడుకు తన తల్లి లతశ్రీకి ఫోన్‌లో చెప్పాడు. సంగారెడ్డిలో ఉన్న ఆమె పలుమార్లు రాముకు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానించి సోమవారం కరీంనగర్‌కు చేరుకుంది. తన భర్త రాము శనివారం రాత్రి నుంచి కనిపించడం లేదని, అతడి స్నేహితుడు సంతోష్ ఫోన్ చేయగా వెళ్లాడని తెలిపింది. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు పోచమ్మవాడ లోని సంతోష్ ఇంటికి వెళ్లి తాళం పగులగొట్టి చూశారు. రాము మృతదేహం ముఖం, తల, కాలిపైగాయాలతో రక్తపు మడుగులో కుళ్లినస్థితిలో ఉంది. పోలీసులు సీసీకెమెరాలు పరిశీలించగా సంతోష్ మృతుడి బైక్ తీసుకొని కోతిరాంపూర్‌లోని ఒక వైన్‌షాపు వద్దకు చేరుకున్నట్లు, అక్కడ మద్యం కొనుగోలు చేసి వెళ్లిపోయినట్లు గుర్తించారు. మృతుడి బైక్ వైన్‌షాపు వద్ద పార్క్ చేసి ఉంది. సంతోష్ సిద్దిపేట జిల్లాలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తుండగా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై గతంలో కరీంనగర్‌లో ఒక పోక్సో కేసు కూడా నమోదైనట్లు తెలిసింది. రాము భార్య లతశ్రీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెలూన్ షాపు దగ్ధం

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ క్రాస్‌రోడ్‌వద్ద ఓ సెలూన్‌షాపులో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. మొలంగూర్ గ్రామానికిచెందిన విజ్జిగిరి శివనాగేంద్ర కొన్నిరోజులక్రితం క్రాస్‌రోడ్ వద్ద సెలూన్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు సెలూన్‌షాపునకు తాళం వేసి ఇంటికివెళ్లాడు. అర్ధరాత్రి సెలూన్‌లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి శివనాగేంద్రకు సమాచారం అందించారు. వెంటనే శివనాగేంద్ర సెలూన్ వద్దకు చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపకసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అప్పటికే సెలూన్‌లోని సుమారు లక్ష రూపాయల విలువచేసే సామగ్రి దగ్ధమైంది.

సంఘటనపై కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శివనాగేంద్ర తెలిపారు.



దగ్ధమవుతున్న సెలూన్ షాప్

పేకాట స్థావరంపై దాడి

కోనరావుపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామశివారులో స్థావరంపై దాడిచేసి నగదును స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా, నలుగురు తప్పించుకున్నారని, నిందితులపై కేసు నమోదు చేసి రూ.4400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- వృద్ధురాలు మృతి
- మరొకరికి స్వల్పగాయాలు

గన్నేరువరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలం లోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఓవర్ స్పీడుతో వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న వృద్ధురాలు బొంగాని రాజమ్మ(88) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన బొంగాని రాజమ్మకు బొంగాని మొగిలయ్య, బొంగాని మల్లయ్య అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిరువురు తనతల్లిని వంతులవారీగా చూసుకుంటున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న పెద్దకొడుకు మొగిలయ్య మందమర్రిలో తన తమ్ముడివద్ద ఉన్న తల్లిని తీసుకరావడానికి తన కొడుకు అనిల్‌కుమార్‌ను మందమర్రికి పంపించాడు. ఆదివారం మందమర్రి నుంచి నానమ్మ రాజమ్మను ఏపి11ఏపి0960 నంబర్ గల కారులో ఎక్కించుకొని అనిల్ కుమార్ హైదరాబాద్ బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని గుండ్లపల్లి స్టేజివద్దకు రాగానే ఓవర్‌స్పీడు వల్ల వారు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌కు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాజమ్మకు తీవ్రగాయాలు కాగా మనవడు అనిల్ కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే అనిల్‌కుమార్ స్థానికుల సహాయంతో రాజమ్మను కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. మనవడు బొంగాని అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాధాకిషన్ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రామగిరి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన బోనగిరి నర్సయ్య(47)అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న నర్సయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కట్టరాజీరుకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈత రాని కారణంగా ఊపిరి ఆడక పోవడంతో మృతి చెందాడు. భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఫైఓవర్ బ్రిడ్జీ దగ్గర కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరి రాజయ్య, గూడూరి కొండాల్‌రెడ్డి కారులో కరీంనగర్‌కు వెళ్లి హుజూరాబాద్‌కు వస్తున్నారు. తాడికల్ శివారులో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చల్లూరి రాజయ్య, కొండాల్‌రెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మం డలం లోని తాడికల్ గ్రామంలో సోమవారం ఉదయం వీధి కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయప డ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కర్నాల కృత్విక్ అనేబాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్క ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు, కోతుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయపడిన బాలుడు కృత్విక్

మద్యానికి బానిసై ఒకరి మృతి

కరీంగనర్ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన వేనిగంటి నాగరాజు (35)మద్యానికి బానిసగా మారి డీహైడ్రేషన్‌తో మృతి చెందాడు. మూడోటౌన్ పోలీసుల వివరాల ప్రకారం... హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నాగరాజు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. దీంతోభార్య పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న నాగరాజు సరిగా ఆహారం లేకపోవడం, మద్యానికి బానిసైమత్తులో ఉండడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణించాడు. నాగరాజు తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కమాన్‌పూర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు వద్ద పెద్దపల్లి, మంథని ప్రధానరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దొంతుల వాణి (49)అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. బైకుపై భార్యభర్తలు కల్వచర్ల నుంచి కమాన్‌పూర్ వెళ్తున్న క్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్‌సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై కొట్టె ప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భర్త దొంతుల సురేష్ ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్టీపీసీ రక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

● సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్

జ్యోతినగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రక్షణలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పాత్ర కీలకమని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం (రైజింగ్ డే) సందర్భంగా సోమవారం సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఈడీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టుల రక్షణతో పాటు ఉద్యోగులను నిత్యంసీఐఎస్ఎఫ్ జవానులు రక్షిస్తున్నారన్నారు. సంస్థ ఆస్తులను కాపాడడం, అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నదన్నారు. పారిశ్రామిక ఆస్తుల రక్షణకోసం ఏర్పడిన సీఐఎస్ఎఫ్ పారా మిలిటరీగా మారి 50ఏళ్లకుపైగా అనేక కేంద్ర ప్రభుత్వసంస్థలకు రక్షణ బాధ్యతలను చూస్తున్నదన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి ఎన్టీపీసీకి సేవలందించాలని చందన్‌కుమార్ కోరారు. రేజింగ్ డే సందర్భంగా బ్యారక్స్ (సీఐఎస్ఎఫ్‌టౌన్‌షిప్)లో జవానులు పరేడ్ నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. సీఐఎస్ఎఫ్ రామగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ ముఖేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్లు అంజనేయరాజు, శాస్త్రి, అధికారులు, జవానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుఎర్, సీఐఎస్ఎఫ్ అధికారులు

బీసీలకు అవకాశం కల్పించడం అభినందనీయం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలు బలహీనవర్గాల నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీట్లు కేటాయించడం అభినందనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే ఎఫెక్ట్ కారణంగానే బడుగు, బలహీన వర్గాల వారికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం దక్కిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రాజరాజేశ్వరి గౌడ సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని సోమవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇతర దాతలతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే ఎఫెక్ట్‌తోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు బీసీ నాయకులకు పోటీ చేసే అవకాశం లభించిందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ మూడు పార్టీలు ఐదుగురు బడుగు, బలహీన వర్గాలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడానికి బీసీ మంత్రిగా స్వాగతం తెలుపుతున్నానని అన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి 42 శాతం రిజర్వేషన్లు సాధించడంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఎదగాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు 200 కోట్ల రూపాయల చొప్పున 55 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు 11 వేల కోట్ల రూపాయలు మంజూరు చేయడం సంతోషకరమైన విషయమని, ఇది విప్లవాత్మకమైన నిర్ణయం అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు మంజూరు చేసి నందుకు సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతు న్నానన్నారు. బలహీనవర్గాలకు చెందిన నాయకులకు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించడంపై అన్ని పార్టీల నాయకత్వాలకు పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సంఘం ట్రస్టు ప్రతినిధులు, నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. ప్రణాళిక ముఖ్యం

- ముందస్తు సన్నద్ధతే కీలకం
- వార్షిక, ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు
- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇది పరీక్ష కాలం. వార్షిక పరీక్షలతోపాటు పైచదువుల ప్రవేశ పరీక్షల కోసం సిద్ధమయ్యే సమయం. పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికతో ముందుకెళ్లడం కీలకం. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 నుంచి పదోతరగతి పరీక్షలు మొదలవనున్నాయి. డిగ్రీ వార్షిక పరీక్షలకు తోడు ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షల తేదీలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. కోరుకున్న విద్యా సంస్థలు, కోర్సుల్లో చేరాలనే లక్ష్యంతో చదువుతున్న విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వార్షిక, ప్రవేశ పరీక్షల్లో రాణించేందుకు సమాయత్తమవ్వాలి. అయితే వార్షిక పరీక్షల పాఠ్యాంశాల కంటే అర్హత పరీక్ష ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఇష్టమైన కోర్సు ఆసక్తి గల కళాశాలల్లో సీటు దక్కాలంటే ప్రతిక్షణం విలువైనదిగా భావించాలి. అప్పుడే విద్యార్థుల కల సాకారం అవుతుంది. పోటీ పరీక్షల్లో సరైన సమయంలో సరైన సమాధానం గుర్తించిన వారే విజేతగా నిలుస్తారు. ఇందుకోసం పోటీ పరీక్షలకు మరింత కష్టపడి చదవాల్సి ఉంటుంది.

కీలక అంశాలు

కొన్ని ప్రవేశ పరీక్షల్లో మినహా విధిగా జనరల్ నాలెడ్జ్ పరీక్షిస్తారు. అందుకే అభ్యర్థి గత ప్రశ్న పత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిపై ఒక అంచనాకు రావాలి. ఒక మార్కు కోసం నాలుగు సమాధానాలు గుర్తించడం, జతపర్చడం వంటి ఎక్కువ ప్రశ్నలు తక్కువ మార్కులు అనే విషయాన్ని గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన, అంతర్జాతీయ సదస్సులు, రాజ్యాంగ సవరణలు, తెలంగాణ ప్రభుత్వ విధానాలు, వర్తమాన అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను గుర్తించాలి. ఇదే కాకుండా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలు అధిక సమయాన్ని తీసుకుంటే మిగతా వాటికి సమాధానాలు గుర్తించే అవకాశం కోల్పోయినట్లే. అయితే సమయ నిర్వహణ ఎంతో కీలకం. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలి. సరైన నిద్ర, ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

ఇలా చేస్తే ప్రయోజనం

తొలుత ప్రతీ అంశంపై పట్టు సాధించేలా చదవాలి. అర్థం కానివి, పూర్తిగా కఠినమైనవి వదిలి మిగతా అంశాలను వంద శాతం అర్థవంతంగా చదవాలి. రోజులు గడుస్తుంటే పరీక్ష సమీపిస్తుందనే భయం ఉంటుంది. సిలబస్ ప్రకారం ఉత్తమ అంశాలపై ఒక అవగాహన వచ్చిన తర్వాత, పునఃశ్చరణ, సాధన వంటివి ఒక క్రమ పద్ధతిలో అనుసరిస్తే ప్రయోజనం కలుగుతుంది.

- ఉదయం 5 గంటలకు నిద్రలేవాలి.
- 6 నుంచి7 గంటల వరకు గత రాత్రి చదివిన అంశాలను రివిజన్ చేసుకోవాలి.
- 7 నుంచి 10 గంటల వరకు కఠిన అంశాల పఠనం.
- 10 నుంచి 12 గంటల వరకు గ్రూప్ డిస్కషన్.
- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకు సందేహాల నివృత్తి అనుభవజ్ఞుల సలహాలు, నిపుణుల శిక్షణ.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గత పరీక్షల ప్రశ్న పత్రాల సాధన.
- సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు అప్పటి వరకు చదివిన అంశాలను మననం చేసుకోవడం.
- రాత్రి 10 నుంచి 11 గంటల వరకు మరోసారి చదవాలి.



సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి

డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



ప్రతీ అంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి, కాన్సెప్ట్‌ అర్థం చేసుకోవడంపై దృష్టి సారించాలి. ప్రణాళికబద్ధమైన అధ్యయనంతోపాటు సిలబస్ పూర్తిగా తెలుసుకోవాలి. ప్రతి రోజు ఒక నిర్దిష్టమైన సమయంలో చదవాలి. నిరంతర అభ్యాసనం జీవితంలో ఎల్లప్పుడూ అవసరం. దాని ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటాం.

స్వీయ అధ్యయనం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

డాక్టర్ ఎం.కల్పన, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల.



విద్యార్థులు కోచింగ్ తరగతులకు హాజరైనా ఎల్లప్పుడూ స్వీయ అధ్యయనానికి కట్టుబడి ఉండాలి. స్వీయ అధ్యయనం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వారి బలహీనతలు తెలుసుకోవడానికి సహాయపడుతుంది. స్వీయ అధ్యయన సమయాల్లో పునఃశ్చరణ చేసి నిర్ధారించుకోవాలి. ప్రణాళికాబద్ధంగా వ్యూహాన్ని అనుసరించాలి.

పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

డాక్టర్ ఎన్.మనోజ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్



విద్యార్థులు అకడమిక్ పరీక్షలకుగానీ, పోటీ పరీక్షలకుగానీ సమర్థవంతంగా సన్నద్ధం కావాలి. పరీక్షా సరళిని, సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకోవాలి. వివరణాత్మక అధ్యయన ప్రణాళికను రూపొందించాలి. గత ప్రశ్నపత్రాలు, మాక్ పరీక్షలతో సాధన చేయాలి, పాఠ్యాంశాలు పూర్తిగా చదవడంతోపాటు పునఃశ్చరణకు సమయం కేటాయించాలి, చాలాసార్లు పునఃశ్చరణ చేయడంతో పరీక్షల్లో చేసే చిన్న చిన్న తప్పులను అధిగమించవచ్చు.

పరీక్షల షెడ్యూల్

- ఏప్రిల్ 29, 30 తేదీల్లో ఎప్‌సెట్ (అగ్రికల్చర్, ఫార్మసీ).
- మే 2 నుంచి 5 వరకు ఎంసెట్ (బీటెక్).
- మే 2న ఈసెట్(బీటెక్, బీఫార్మసీలోకి లేటరల్ ఎంట్రీ).
- జూన్ 1న ఎడ్‌సెట్.
- జూన్ 6న లాసెట్ (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం).
- జూన్ 8,9 ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ).
- జూన్ 16, 19న పీజీఈసెట్ (ఎంటెక్, ఎంఫార్మసీ).
- జూన్ 11,14 తేదీల్లో పీఈసెట్ (డీపీఎడ్, బీపీఎడ్).



శివకల్యాణ వేడుకలకు సిద్ధం

- 17న స్వామివారి దివ్యకల్యాణానికి ఏర్పాట్లు
- ఐదు రోజులపాటు కల్యాణ వేడుకలు



వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీపార్వతిపరమేశ్వరుల కల్యాణ వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 17వ తేదిన సోమవారం ఉదయం 10.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు ఆలయ చైర్మన్ గెస్ట్‌హౌస్ ముందు భాగంలో స్వామివారి దివ్యకల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు ఐదు రోజులపాటు శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. కాగా 19న బుధవారం సాయంత్రం 3.05 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆర్జిత సేవలు రద్దు..

శివకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని 16వ తేది నుంచి 20వ తేదీ వరకు రాజన్న ఆలయంలో భక్తులు జరిపించుకునే నిత్య కల్యాణం, లింగార్చన, సత్యనారాయణ వ్రతము, అభిషేకములు, అన్న పూజ, సేవల టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. 17వ తేది శివకల్యాణం రోజున నిత్యచండీ సహిత రుద్రహోమం టికెట్లు రద్దు చేశారు. అంతే కాకుండా శివకల్యాణోత్సము సందర్భంగా 16వ తేది ఆదివారం కోడె మొక్కులు రాత్రి 11.30 గంటల వరకు కొనసాగుతాయని, 17వ తేదిన సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కోడె టికెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. తిరిగి శివకల్యాణం అనంతరం భక్తులకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రేపే కామదహన ఉత్సవం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం కామదహన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీన బుధవారం సాయంత్రం ప్రదోషపూజ అనంతరం కామదహన ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. కామదహన ఉత్సవాలను ఈనెల 12త తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు స్వామి కల్యాణ మండపంలో డోలా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రెండు తలలతో కోడిపిల్ల జననం



మల్యాల, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): మల్యాల మండలంలోని కొండగట్టులో కోడిపిల్ల రెండు తలలతో జన్మించింది. సిక్కుల శారద అనే మహిళ కొన్ని రోజుల క్రితం కోడి గుడ్లను పొదిగేసింది. సోమవారం వాటిని చూడగా అందులో ఒకటి రెండు తలలతో జన్మించిన కోడిపిల్ల కనిపించింది. అయితే కాసేపటికే ఆ కోడిపిల్ల మృతి చెందింది. జన్యులోపంతోనే కోడిపిల్ల రెండు తలలతో జన్మించిందని వెటర్నరీ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం

- భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం
- కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసి పోయా యి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం కోడె మొక్కు క్యూలైన్‌లో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ధర్మ దర్శనం, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని రాజ రాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

రాజన్నకు అత్యంత ప్రీతికరమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గండా దీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని భీమేశ్వర స్వామి ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం రాజన్న ఆల యానికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కోడెపూజతోపాటు ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. కాగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సోమవారం రాజన్న ఆలయానికి వచ్చారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చింతామణి చెరువు వద్ద పుట్ట బంగారం కోసం స్వామి వారలకు ప్రత్యేక పూజలు

పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవలు ఊరేగింపు

ధర్మపురి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉద యం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండి తులు, అర్చకులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్త మాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షా వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ నేతృత్వంలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్త మాచార్యులు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు.

సాయంత్రం లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను సేవలపై ఆశీనులు చేసి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకు వెళ్లారు. చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్ద సేవలను ఉంచి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకు వచ్చారు. స్వామి వారలకు కరీంనగర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

అలాగే శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన వెన్నెం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు కలిసి మూడు లక్షల విలువ గల మూడు కిలోల వెండితో తయారు చేయించిన శంఖు, చక్రం, ముంజేతులు ఆభరణాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగన భట్ల దినేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి భారీ బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ మఠం స్థలంలో గల యాగశాల వద్ద నూతన కల్యాణ వేదికపైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి 10 గంటల నుంచి శ్రీ ముదపాక బాల సుందరం భాగవతార్‌చే హరికథ కాలక్షేపం ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



పుట్ట బంగారం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, బ్రహ్మోత్సవాల కోసం ఆలయానికి వస్తున్న భక్తులు, ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, స్థానికులు

కొండగట్టులో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు వేకువజామున తిరుమం జనము, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవిత్రాహ్వానము, పుణ్యాహ వాచనము, రక్షాబంధనం, రుత్విక్‌వరుణం, యాగశాల ప్రవేశం, స్థాపిత దేవతార్చన, అగ్ని ప్రతిష్ఠ, హవనం, శ్రీ స్వామి వారికి అభిషేకం, అర్చన, మహ నివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంకాలం శ్రీ విష్ణు సహస్ర నామ, హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. అనంతరం స్థాపిత దేవతారధన, హవనం, పవిత్రలకు జలాధివాసం, ధాన్యాదివాసం, బలిహరణం, వేదసదస్యం, మంత్ర పుష్పం, శాత్తుమొర, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టు వస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సుల్తానాబాద్, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎదుర్కోళ్ల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అందరూ ఊరేగింపుగా వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకొని కల్యాణం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పుష్పలత, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, ఆలయ చైర్మన్ పల్లా మురళి, డైరెక్టర్లు, పుర ప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కరీంనగర్ అర్బన్: మరణించిన వారి పేర్లతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు, వివాహమై వెళ్లినవారు, అద్దె ఇళ్లు ఖాళీ చేసినవారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని సోమ వారం అడిషనల్ కలెక్టర్, ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి మహ్మద్ అజీం తెలిపారు.

సుభాష్‌నగర్: కోతిరాంపూర్‌లోని సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సీడ్‌బాల్, వర్మీ కంపోస్ట్ తయారీపై సోమవారం శిక్షణ అందజేశారు. పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సతీష్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ప్రభుత్వ కళాశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో మెడి కవర్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు.

గణేశ్‌నగర్: ట్రాన్స్‌ఫార్మర్ల టెస్టింగ్‌కు అధునాతన పరికరాలను డిపార్ట్ మెంట్ ఎస్‌పీఎం సెంటర్‌ను కరీం నగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమేష్‌బాబు సోమవారం ప్రారం భించారు.

కరీంనగర్ క్రైం: జగిత్యాల జిల్లాలోని సారంగపూర్ మండలం నాగునూరులో అంబేద్కర్ విగ్రహాన్ని అవమాన పరిచిన దుండగులపై చర్యలు తీసు కోవాలని జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో కరీంనగర్-2 పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు కడే శంకర్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా నిఫా ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు చేపట్టనున్న రక్తదాన శిబిరాల పోస్టర్‌ను సోమ వారం శాతవాహన యూని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ఆవిష్కరించారు.

సుభాష్‌నగర్: కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన బెజ్జంకి మహేశ్‌ను హత్య చేసిన కాల్వ సతీష్, ఏడెల్లి సతీష్‌కు బెయిల్ ఇవ్వకూడదని ఎమ్మార్పీఎస్ నాయ కుడు గోష్కి శంకర్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహిం చారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్‌లో మంచినీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్. మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మానకొండూర్‌లో మిషన్ భగీరథ ద్వారా రాజీవ్‌నగర్, దళిత కాలనీ, బీసీ కాలనీలలో తాగునీరు అందడం లేదని గ్రామస్థులు సమావేశ దృష్టికి తీసుకొచ్చారు. పైపుల లీకేజీతో నీరు కలుషితమవుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. గంగిపల్లి, కొండపల్కల, ఊటూర్, పచ్చునూర్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సకాలంలో అందేలా చూడాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో సగానికి పైగా నీరు అందిస్తున్న బావిని పరిశీలించారు. వర్షాకాలంలో బావిలోకి బయట నీరు చేరి కలుషితం కాకుండా చుట్టూ సిమెంట్ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో పర్యటించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురికికాలువల నిర్మాణం చేపట్టి మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తామని, తాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామాలలో మంచినీటి సమస్యతోపాటు విద్యుత్ లైట్లు, పరిశుభ్రతను చేపట్టి వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో వేసవికాలం పూర్తయ్యే వరకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఎంపీడీవో వరలక్ష్మి, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, ఈఈ గ్రిడ్ రాములు, అంజన్‌రావు ఈఈ ఇంట్రా, ప్రసాద్‌కుమార్ డిప్యూటీ గ్రిడ్, శ్రీనివాస్ డిప్యూటీ ఇంట్రా, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ టెక్నికల్, సేఫ్టీ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారన్నారు. సంస్థ చేయాల్సిన పనులను విని యోగదారులు సొంతంగా చేయవద్దన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఉన్న తీగలను తాకరాదని, కనిపించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. దుస్తులు ఆరవేసే తీగల పైనుంచి విద్యుత్ వైర్లు వెల్లడంతో ఇన్సులేషన్ సరిగ్గా లేక దండాలకు విద్యుత్ సరఫరా అయ్యి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, ప్లాస్టిక్ దండాలను ఉపయోగించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912టోల్ ఫ్రీలో సంప్రదించాలని సూచించారు.

జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో జనరల్ నాలెడ్జి కీలకంగా ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థి సమాజంలోని విషయాలను సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. న్యూఢిల్లీకి చెందిన గ్లోబల్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన జీకే ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి

భగత్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆర్టీసీ జేఏసీ రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ సురేష్, జిల్లా జేఏసీ చైర్మన్ ఎంపీరెడ్డి, వైస్‌చైర్మన్ కొమురయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఎస్‌యూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో ఉమెన్ సెల్, జాతీయ సేవా పథకం యూనిట్ల సంయుక్తంగా సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాకర్ మనోహర్, ఉమెన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి. డీన్ సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహం ముసుగు తొలగింపు

కరీంనగర్ అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా రాజీవ్ చౌక్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి మున్సిపల్ అధికారులు తొడిగిన ముసుగును యువజన కాంగ్రెస్ మాజీ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. కోడ్ ముగిసినా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇందిరాచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి ముసుగు తొలగించకపోవడంతో ఆదివారం డీసీసీ అధికార ప్రతినిధి మల్యాల సుజిత్‌కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు.

కోరలు చాస్తున్న బెట్టింగ్ భూతం

(5వ పేజీ తరువాయి)

బలి చేస్తున్నారు. బెట్టింగ్ అనేది ఒకప్పుడు క్రికెట్ మ్యాచ్‌లు జరిగిన సమయాల్లో రహస్యంగా నడిచేది. కాని ప్రస్తుతం ఏ పోటీలతో సంబంధం లేకుండా ఆన్‌లైన్ గేమ్స్‌ను నిర్వహిస్తూ అందులో బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ ఉన్న వ్యక్తికి ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన ప్రకటనలు వస్తున్నాయి. మీకు వెయ్యి రూపాయలు ఉచితంగా జమచేశామని సంక్షిప్త సందేశాలు వస్తున్నాయి. ఇలాంటి సందేశాలకు స్పందిస్తే ఆన్‌లలైన్ బెట్టింగ్ మాయలో పడి బలికావాల్సిందే.

● అప్పులపాలవుతున్న యువత

తోటి స్నేహితులతో లేదా వారి ఫోన్‌లో వచ్చే ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ గేమ్స్ ప్రకటనలను చూసి యువత సరదాగా ఆన్‌లైన్‌లో కొద్ది డబ్బులతో ఆట(జూదం)ను మొదలు పెడతారు. ప్రారంభంలో డబ్బులు గెలుచుకునేలా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులు ప్రోగ్రామింగ్ ఇస్తూ వారిని బెట్టింగ్‌కు బానిసలుగా మార్చుతున్నారు. తమ కుటుంబాలకు తెలియకుండా స్నేహితులు, పరిచయస్థులు, ఇతర ఎక్కడెక్కడి నుంచో డబ్బులు తీసుకువచ్చి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెడుతున్నారు. ఆ తరువాత డబ్బులు పోగొట్టుకుంటూ... పోయిన డబ్బులు రికవరీ కోసమంటూ ఇతరుల వద్ద అప్పులు చేయటం, అందుబాటులో ఉన్న వస్తువులను విక్రయించి వచ్చిన డబ్బులతో బెట్టింగ్ ఆడుతున్నారు. ఈ క్రమంలో వారికి తెలియకుండానే లక్షల్లో అప్పులపాలవుతున్నారు. ఈ విషయం తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు చెబితే ఎక్కడ ఆగ్రహం వ్యక్తం చేస్తారోనని, బంధువుల వద్ద ఎక్కడ పరువుపోతుందోనని మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థులు, యువతపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కాస్త నిఘా ఉంచాలని పోలీసులు కోరుతున్నారు. ఒంటరిగా స్మార్ట్‌ఫోన్‌లతో ఆడుతుండడాన్ని గమనించి తనిఖీ చేయాలని, పిల్లల బ్యాంక్ ఖాతా లావాదేవీలు, ఫోన్‌లోని ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించాలని సూచిస్తున్నారు. తొలిదశలో ఇటువంటి వ్యసనాలను నియంత్రించకుంటే వాటికి బానిసలుగామారి బెట్టింగ్ మహమ్మారి నుంచి బయటకు రావడం కష్టంగా మారుతుంది. పోలీసు శాఖ, ప్రభుత్వం కూడా ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నియంత్రించే వ్యవస్థను పకడ్బందీగా తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై 25 శాతం రిబేట్

కరీంనగర్‌టౌన్, మార్చి10 (ఆంధ్రజ్యోతి):నగరంలో ఎల్‌ఆర్‌ఎస్ 2020 ద్వారా అనధికార లేఔట్, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31లోగా చార్జీలు చెల్లించి 25 శాతం రిబేట్ పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు. సోమవారం టౌన్ ప్లానింగ్ అధి కారి బషీరుద్దీన్ ఏసీపీ, టౌన్ ప్లానింగ్ అధికారి వేణు ఆధ్వర్యంలో ఫీజులకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన 25 శాతం రిబేటు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రికెట్ సంబరాల్లో లాఠీచార్జి అసత్యప్రచారం

కరీంనగర్ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): క్రికెట్ సంబరాల్లో ఆదివారం రాత్రి లాఠీచార్జి జరగలేదని, వాస్తవం తెలుసుకోకుండా అసత్య ప్రచారం చేస్తున్నారని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంటకస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీలో ఇండియా విజయసాధించిన సందర్భంగా ఇందిరాచౌక్‌లో క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అక్కడున్న పోలీసులు వాహనాలకు అడ్డుగా రాకుండా చూశారని పేర్కొన్నారు.

'పారమిత'లో ముగిసిన ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్

గణేశ్‌నగర్,మార్చి10(ఆంధ్రజ్యోతి): మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్ ఎగ్జిబిషన్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు. అనంతరం విజేతలకు ఉమేష్ కుమార్ అవార్డులు, అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, టీఎస్‌వీ రమణ, వినోదరావు, వీయుఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, శ్రీకర్, శర్మిష్ఠ, ప్రశాంత్, కవితాప్రసాద్, గోపీకృష్ణ, పీబీఎల్ హెడ్ లలిత్ మోహన్ సాహు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి చదరంగం పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రైస్ ఆఫ్ ది చెస్ టైటాన్ ఓపెన్ చదరంగ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా గోదావరిఖని ట్రినిటి కళాశాల ప్రిన్సిపాల్ యుగేందర్, జీనియస్ చెస్ అకాడమీ చైర్మన్ కంకటి కనకయ్య బహుమతులను ప్రదానం చేశారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనూప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి బాయి ఫూలే జీవితం స్ఫూర్తిదాయకం



నివాళులు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిఫూలే జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ అన్నారు. సావిత్రిబాయిఫూలే వర్ధంతి సందర్భంగా సోమవారం ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మెయిన్ గేటు ఎదుట ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ నాయకులు శివ, వినోద్, రంజిత్, దీపాక్, పవన్, శివ సాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి సాగర్ పాల్గొన్నారు,

జ్యోతిబా పూలే కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో సావిత్రి బాయిఫూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఉమ్మడిజిల్లా అధ్యక్షుడుకోటేశ్ కుమార్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం జ్యోతిబా పూలే జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, ఉప్పు శ్రీనివాస్, రఘుచారి, కొలిపాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులకు పదవులను అమ్ముకున్న రసమయి: కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గతంలో సింగిల్‌విండో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను మానకొండూర్ మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ సోమవారం ఎల్ఎండీకాలనీలోని క్యాంపు కార్యాలయంలో మండలకాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోరండ్ల సింగిల్‌విండో చైర్మన్‌గా చేస్తానంటూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రూ.40లక్షలు డిమాండ్ చేయగా, తాను 20లక్షలు మాత్రమే ఇవ్వగలగుతానని అదికూడా భూమి అమ్మి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పానని తిమ్మాపూర్ మాజీసర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. దీంతో రసమయి బాలకిషన్ తనకు కాకుండా 30లక్షలు ఇచ్చిన వ్యక్తికి పోరండ్ల సింగిల్‌విండో చైర్మన్ పదవి ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా పదేళ్లపాటు కొనసాగిన రసమయి బాలకిషన్ విలువలకు పాతరేశారని, ఆయనో రాజకీయ అజ్ఞాని అని ప్రదేశ్‌కాంగ్రెస్‌కమిటీ సభ్యుడు బత్తినిశ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రసమయి బాలకిషన్‌కు ప్రజాసేవ కన్నా డబ్బు సంపాదనపైనే యావ ఎక్కువని సెస్‌మాజీ డైరెక్టర్, ఇల్లంతకుంట మండల పరిషత్ మాజీఅధ్యక్షుడు ఊట్కూరి వెంకటరమణా రెడ్డి విమర్శించారు. గోసి,గొంగడితో వచ్చిన రసమయి బాలకిషన్ కోట్ల విలువ చేసే ఆస్తులు ఎలా సంపాదించాడో చెప్పాలని జిల్లా సహకారకేంద్ర బ్యాంక్‌డైరెక్టర్ అలువాల కోటి డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ (గన్నేరువరం) మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, ఇల్లంతకుంట అధ్యక్షుడు బి రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, బండారు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సైదాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో సోమవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శతవాసిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉదయం నుంచి ప్రత్యేకపూజలు చేశారు. శ్రీగోదా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అర్చకులు మంత్రోచ్ఛరణాల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షించారు.

రూ.7150 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 24మంది రైతులు 338క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

అన్ని నోటిఫికేషన్ల ఫలితాలు నిలిపివేయాలి

సుభాష్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన ఫలితాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆదివారం చేపట్టిన దీక్షను సోమవారం విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ చేయకుండా గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటించడం మాదిగ, మాదిగ ఉప కులాలకు అన్యాయం చేయడమేనన్నారు. తుంగ ఆంజనేయులు, దండు అంజయ్య, తడగొండ శంకర్, బోయిని సదానందం, అంబాల మధు నయ్య, కొత్తూరి రాజయ్య, దండు వరలక్ష్మి, కొమురమ్మ, శారద పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో అర్మాఖాన్ ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న పెద్దపల్లి బీఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ గోజిరాయి విద్యార్థి అర్మాన్‌ఖాన్ సత్తాచాటి బంగారు పతకంతోపాటు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ సాధించాడు. ఆల్ కలర్ బెల్ట్ అండర్-19 విభాగంలో అర్మాన్‌ఖాన్ నాలుగోసారి గ్రాండ్ ఛాంపియన్‌గా నిలిచాడని అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ అన్వర్‌ఖాన్ తెలిపారు.

మండల ఏర్పాటును అడ్డుకున్నది బీఆర్ఎస్ నాయకులే

గంగాధర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గర్షకుర్తి మండలంగా ఏర్పాటు కాకుండా అడ్డుకున్నది ఆనాటి బీఆర్ఎస్ నాయకులేనని టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ కరీంనగర్ కోఆర్డినేటర్ మ్యాక వినోద్ అన్నారు. సోమవారం ఆయన గంగాధరలో మాట్లాడారు. మండలంలోని బూరుగుపల్లి మండల కేంద్రం ఏర్పాటు కోసం గర్షకుర్తిని మండలంగా ఏర్పాటు కాకుండా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అడ్డుకున్నారని విమర్శించారు. గర్షకుర్తి మండలకేంద్రంగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్త శుద్ధితో ఉన్నారని తెలిపారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ బొడ్డు మహేష్ పాల్గొన్నారు.

గ్రామస్థుల నిరసన

జమ్మికుంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రైల్వేప్రహరీ ఆనుకొనిఉన్న12ఫీట్ల రహదారి తీసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట కొత్తపల్లివాసులు సోమవారం నిరసన చేపట్టారు. మున్సిపల్ అధికారులు స్పందించి 12ఫీట్లరహదారి ఏర్పాటు చేయాలని, లేని ఎడల రిలేనిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

పోరాటం ఉధృతం చేస్తాం

తిమ్మాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో నెలకొల్పిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు ముసుగులు తొలగించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని పొలిటికల్ జేఏసీ నేతలు హెచ్చారించారు. విగ్రహాలను ఆవిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయంపక్కన రిలేనిరాహార దీక్షలను ప్రారంభించారు. మాజీజడ్పీటీసీ ఇనుకొండ జితేందర్‌రెడ్డి మద్దతు తెలిపారు.

ఘనంగా నరసింహస్వామి కల్యాణం



ఇల్లందకుంట: ఉగ్రనరసింహస్వామికి ఫలపంచామృత అభిషేకం

తిమ్మాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి పలు పూజలు నిర్వహించిన అర్చకులు సాయంత్రం శ్రీలక్ష్మీనారసింహ, శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు.వేడుకకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఫలపంచామృత అభిషేకం, అర్చన, పూజలు చేశారు. నేడు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో ఈనెల14నశ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర ఘనంగా నిర్వహిస్తామని పాలకమండలి అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మీనారాయణ, కోశాధికారి అరిగెల రమేష్ ప్రకటనలో తెలిపారు.

క్షీరాభిషేకం..

గంగాధర: చొప్పదండి నియోజకవర్గానికి యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూలు మంజూరు చేసి, దానినిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేసినందుకు గంగాధరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యం చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

ఎకరానికి రూ. 20లక్షలు చెల్లించాలి

సైదాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు కిందపోతున్న భూములకు ఎకరానికి రూ.20లక్షలు చెల్లించాలన్నారు. రూ. 12.20లక్షలు ఇస్తామనడం సరికాదన్నారు. వికారాబాద్ జిల్లాలో లగచర్ల గ్రామస్థులకు ఎకరానికి రూ. 20లక్షల ప్రకటించారన్నారు. అదేవిధంగా తమకు కూడా చెల్లించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

తిమ్మాపూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వీ గోపాలాచారి అన్నారు. సోమవారం నుస్తులాపూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారులఫోరం కోర్టు నిర్వహించారు. పలువురు వినియోగదారుల ఫిర్యాదులను తీసుకుని పరిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు చరణ్‌దాస్, డీఈ తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట..

సైదాపూర్: మండలంలోని ఎలబోతారం, చింతలపల్లి గ్రామాల్లో సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్‌డీఈ ఉపేందర్ విద్యుత్ ప్రమాదాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మోటర్ల వద్ద కెపాసిటర్లు వాడడం వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. విద్యుత్ సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

జనఔషధి కేంద్రం ప్రారంభం

చొప్పదండి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జనఔషధి కేంద్రాన్ని చైర్మన్ వెల్మ మల్లారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనఔషధి కేంద్రాన్ని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే ప్రథమమని, అన్నిరకాల మందులు 70శాతం వరకు తక్కువ ధరకే లభిస్తాయని తెలిపారు.

పంటలకు సాగునీరందించాలి

గంగాధర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గర్షకుర్తిలో ఎండుతున్న పంటలకు సాగునీరందించాలని మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం గర్షకుర్తిలో ఆరుతున్న వరిపొలాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తక్షణం గోదావరి జలాలతో పంటపొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. నీరువిడుదల చేయకుంటే రైతులతో ఆందోళనచేపడతామని హెచ్చరించారు.

అవీ.. ఇవీ..

వీణవంక: మండలంలోని వివిధ గ్రామాల్లోని 220మంది నిరుపేద విద్యార్థుల ఉన్నతచదువుల కోసం యూఫ్‌టీవీ సీఈవో పాడి ఉదయనందన్‌రెడ్డి తమ సభ్యుల ద్వారా రూ.4,40,000స్కాలర్‌షిప్ చెక్కులను సోమవారం అందజేశారు.

-వీణవంకమండలంలోని బోంతుపల్లి గ్రామానికి చెందిన జున్నుతుల కౌసల్య జ్ఞాపకార్థం మామిడాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఈవో శోభారాణి పరీక్షప్యాడ్స్ పంపిణీ చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం రూ.50వేల విలువ గల వాటర్ కూలర్, వాటర్ ప్యూర్‌ఫయర్‌లను పూర్వ విద్యార్థి ముక్క శివకుమార్ అందజేశారు.

జమ్మికుంట రూరల్: మున్సిపల్ పరిధిలోని శ్రీసత్యసాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 40మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్‌లో సేవ్‌దట్రీస్ అధ్యక్షుడు, సామాజిక వేత్త వర్ధినేని రవీందర్‌రావు జన్మదిన వేడుకలు సోమవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.